
# సింహాచలం అప్పన్న

నంబూరు రంగారావు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అడుగుపెట్టిన అప్పన్నకు గుండె జల్లుమంది. ''ఏటీ జనం- వరదగ్గాని కొట్టుకొచ్చారా ఏటి'' అని జనాంతికంగా అనుకున్నాడు. ఎలాగో ఒకలా జనాన్ని తప్పించుకుని బ్రిడ్జ్ ప్రక్కగా వచ్చి నిల్చున్నాడు.

''ఏడీ తొత్తుకొడుకు. టేషన్‌కొత్తానని ఎక్కడా అగుపడడు'' అంటూ కొడుకు కోసం ఎదురు చూస్తూ శాపనార్థాలు పెట్టాడు. భుజంమీద మూటను కిందకు దించి, అక్కడున్న బెంచీబల్ల మీద కూర్చుని చుట్ట ముట్టించాడు. చుట్ట దమ్ము తన్మయత్వంలో ఓల లాడుతుండగానే చూపొప్పని పోలీసు చటుక్కునొచ్చి లటుక్కున పట్టుకున్నాడు.



ఎందుకు పట్టుకున్నాడో అప్పన్నకు మొదట అర్థం కాలేదు. వాళ్ల ఊరి టూరింగ్ టాకీస్‌లో అప్పుడప్పుడు చూసిన సినిమాలు గుర్తుకు రావడంతో పోలీస్ ఎందుకు పట్టుకున్నాడో అప్పుడర్థమయింది. వెంటనే మొలలో ఉన్న చుట్టతీసి పోలీసు చేతిలో పెట్టాడు.

ఆ వచ్చిన పోలీసు మహా దేవాంతకుడిలా ఉన్నాడు. చుట్టకు పడేరకంలా లేడు. చేతిలో పెట్టిన చుట్టనీ, అప్పన్న మొహాన్నీ మార్చి మార్చి చూసి ''ఏంబే నకరాలు చేస్తున్నావ్, నడుబే స్టేషన్‌కు'' అన్నాడు పోలీస్ భాషలో.

''నా నిప్పుడేటి సేసినానని టేషన్‌కు తీస్కెల్తావ్'' అంటూ మరోదమ్ము లాగడానికి చుట్టను మూతి దగ్గరపెట్టాడు.

''ఇంకేటి చెయ్యాలిబే- రైల్వే స్టేషన్లో చుట్ట కాల్చుతావా?''

''ఏటి సుట్టకాలిస్తే తప్పేటి, బస్సులు కాలిసినోలిని వదిలేసి సుట్టలు, బీడీలు కాలిసినోలిని పట్టుకుంటారేటి మీ పోలీసులు'' అన్నాడు అప్పన్న.

ఈ మాటలు సరిగ్గా పోలీసు ఆయువుపట్టు మీద తగిలాయి. ఇక నోటితో చెప్పటానికి మెదడు సహకరించకపోవడంతో లాఠీ తీసి అప్పన్న వీపు మీద రెండేశాడు.

వెంటనే అప్పన్న ఎలర్ట్ అయిపోయి, నోట్లో చుట్ట తుపుక్కున ఊసేసి ''ఏటండీ! సుట్ట కాలిస్తేనే ఇంత ఇదిసేస్తన్నావ్- మహా నేరం చేసినట్టు! బాగుంది బాగుంది మా ఊరి ఎరకల ఈరిగాడి లాగ సెయ్యికొచ్చిన దెబ్బ కొట్టేసినావ్'' అన్నాడు ఒంటిమీద తట్టు తేలిందో లేదో లాల్చీ ఎత్తి చూసుకొని.

అంత విషాదంతోనూ అప్పన్నకు ఒక విషయం ఆశ్చర్యం కలిగించింది. అదే విషయం ఒకింత ఆనందాన్నీ కలిగించింది. భూమి ఈనినట్టు, వరదకు కొట్టుకొచ్చినట్టు, ఫ్యాక్టరీల్లో తయారుచేసి పోగులు పోగులు పోసినట్టు ప్లాట్‌ఫాం నిండా జనం ఉన్నా ఒక్కడంటే ఒక్కడు కూడా ఈ తంతు చూడకపోవడం అప్పన్నకు ఆశ్చర్యం కలిగించింది.

'ఇదే మా ఊర్లయితే కోతి గెంతితే కోటిమంది సేరిపోదురు' అనుకున్నాడు మనసులో. ఈ ఆశ్చర్యం కలిగించిన విషయమే అప్పన్నకు ఆనందం కూడా కలిగించింది. తనను పోలీసు దెబ్బలు కొట్టడం, ఒక్కడంటే ఒక్కడు కూడా చూడకపోవడంతో తెగ సంబరపడ్డాడు.

అప్పన్న ఆలోచనల్లో ఉండగానే ''నడు స్టేషన్‌కు'' అన్నాడు పోలీస్.

ఇందాక ఆనందం, ఆశ్చర్యం కలిగించిన విషయమే ఈ సారి విచారం కలిగించింది. ఇంత జనంలో ఒక్కడు కూడా పోలీసు చర్యలను అడ్డుకొని తనకు సపోర్ట్ చేయకపోవడంతో దుఃఖమొచ్చింది. నెమ్మదిగా మూట భుజంపైకి ఎత్తుకుని పోలీసు వెనుక నడవసాగాడు. సరిగ్గా అప్పుడు ''ఒరే అప్పిగా'' అని పొలికేక వినబడింది. ఆకలేసినవాడికి అమృతం అందించినట్లయింది అప్పన్నకు ఆకేక. గిరుక్కున వెనుతిరిగాడు. మైకు చూసిన రాజకీయనాయకుడి లాగా ఒక్కసారిగా ఆనందం మొహంలో ప్రవేశించింది. జనం మధ్యలో నుంచి సింహాచలం. పొట్నూలు పంచెకట్టి, పొందూరు ఖద్దరు లాల్చీతో కొత్త రూపాయి కాసులా మెరిసిపోతున్నాడు. సత్తు కానీలా ఉన్న సింహాచలం కొత్త రూపాయిలా మెరిసిపోవడం చూసి అప్పన్న డంగైపోయాడు. సింహాచలంది అప్పన్న పక్క ఊరే! సంతల్లో పశువుల దళారీ వ్యాపారం చేసే సింహాచలం ఆ చుట్టు పక్క గ్రామాల ప్రజలకు పరిచయస్తుడే! ఉన్నట్టుండి సంవత్సరంన్నర క్రితం గ్రామం విడిచి సింహాచలం కుటుంబం మకాం ఎత్తేసింది. ఎక్కడకెళ్లారో, ఏం చేస్తున్నారో ఎవ్వరికీ తెలీదు. మళ్లీ ఇదిగో ఇప్పుడిలాగ...

''ఒరి సిమ్మాచెలం మనం కలిసి ఎన్నాలయింది? రెండు పంటల కితం మీ పెద్దోడు ఎవడికో సెయ్యిరగ్గొట్టిండని కేసు పెట్నారని బెయిల్ కోసం వచ్చినపుడు, సికాకుళం కోర్టుకాడ కలిసినావు-మళ్లిదే కలవడం ఏటి సంగతి బాగున్నావా? ఎక్కడుంటన్నావ్ ఏటి?''

''ఇక్కడే అయిదరాబాదుల ఉంటన్నాను, మా పెద్దోడి దగ్గర '' చెప్పాడు సింహాచలం.

''మీ బాగోగులు తర్వాత, ముందు స్టేషన్‌కు నడు'' అంటూ అప్పన్నను లాఠీతో నెట్టాడు పోలీసు.

''ఏటిరా అప్పిగా ఈ బాగోతం, ఏటయిందేటి'' అడిగాడు సింహాచలం.

అప్పన్న తన చుట్ట కష్టాలన్నీ చకచకా షార్ట్ కట్‌లో చెప్పాడు.

''ఒస్సింతేనా'' అన్నాడు సింహాచలం అంతా విని.

అంత జరిగితే 'ఒస్సింతేనా' అంటాడేటీడు అనుకున్నాడు అప్పన్న.

సింహాచలం పోలీసు వంక తిరిగి ఏదో చెప్పాడు. అంతే - ఇంతపోలీసోడు రోహిణీకార్తె ఎండలకి వడదెబ్బ తగిలినట్టయిపోయాడు. తను తినాలనుకున్న మాంసం ముక్కను కాకి తన్నుకుపోయినప్పుడు కుక్క చూసే క్రౌర్యం, నిస్సహాయం కలగలిసిన చూపొకటి అప్పన్నవైపు విసిరి పోలీసు అక్కడ నుంచి కదిలాడు.

పోలీసు అలా వెళ్లిపోవడం కలో నిజమో అప్పన్నకు అర్థం కాలేదు. కృష్ణుడి విశ్వరూపం చూసిన అర్జునిడిలా సింహాచలం వైపు చూసి ''సిమ్మాచెలం... చెవిట్ల ఏటి మంత్రమేసావ్- తాసుపాము లాంటోడు తాబేలులాగెలిపోనాడు'' అడిగాడు అప్పన్న.

ఈ ఆనందం తట్టుకోలేక మొలలో నుంచి రెండు చుట్టలు తీసి సింహాచలానికి ఒకటి అందించాడు.

## విషాదంలో వినోదం!!



రమణ మహర్షి ఆశ్రమం కొత్తగా స్థాపించిన రోజులు అవి.

ఒకరాత్రి దొంగలు పడి ఆశ్రమంలో వున్న రెండుశేర్లు బియ్యం, నాలుగు కాసులు మాత్రం తీసుకున్నారు. ఎంతో డబ్బు దస్కం వుంటుందని ఆశించిన దొంగలు విసుగుచెంది, రెచ్చిపోయి రమణస్వామిని ఇనుప రాడ్లతో కొట్టారు. ఈ వార్త దావానలంలా ఊళ్ళోని భక్తులకు చేరింది. ఉదయమే భక్తులు ఆశ్రమానికి ఆదుర్దాగా వచ్చి ''స్వామీ! రాత్రి ఏం జరిగింది'' అని అడిగారు.

''రాత్రి! ఏంలేదు. స్వామికి పూజ జరిగింది'' అన్నారు భగవాన్ చిరునవ్వులు చిందిస్తూ. భక్తులు అవాక్కయిపోయారు.


బొడ్డపాటి రాజేశ్వరమూర్తి,
మచిలీపట్నం

సింహాచలం చుట్టవైపు అప్పన్నవైపు అసహ్యంగా చూసి "సుట్లు మానేసావ్రా అప్పిగా" అన్నాడు.

"ఏటీ నువ్వు సుట్లు మానేసావా- ఏటీ ఇద్దూరం" నిచ్చెం పలాస బీడి పేట్రీ గొట్టంలాగా నోటండ పొగ వదిల్నోడివి నువ్వెలగ సుట్లు మానీనవే" ఆశ్చర్యంగా అడిగాడు అప్పన్న.

"అవున్రా ఇప్పుడు సుట్లు మానేసాను. సిగరెట్లు కాలుస్తన్నాను" చెప్పాడు సింహాచలం... ఒకింత గర్వంగా!

అప్పన్నకి షాక్ మీద షాక్ తగిలి తలకిందులైన ఆశ్చర్యార్థకంలా నిలబడిపోయాడు. కొద్దిసేపటి తరువాత తేరుకొని "ఔన్రోరి సింహాచలం నీకు అయిదరాబాద్‌లో ఇంత పలుకుబడి ఎలాగొచ్చింది. ఆ పోలీసోడు మంత్రమేసినట్టు అలాగెలిపోనాడు"




"మా పెద్దోడి వల్లనెహే"

"ఏటి ఏడోతరగతి పోయి గుంటలనెనకేసుకొని బలాదూర్ తిరుగులు తిరిగిన సత్తెగాడు ఇప్పుడు కలెక్ట్రయిపోండా ఏటి"

"కాదెహే ఆడిపుడు రాజకీయ నాయకుడయిపోనాడు" చెప్పాడు సింహాచలం.

"ఏటి!... ఆయాల ఎవడికో సెయ్యిరగ్గొట్టిన సత్తెగాడే!?" ఇంకా నమ్మబుద్ధికాక " ఆడింత పెయోజకుడెనగయిపోనాడు"

"అదంత పెద్ద కథగానీ- పద టేషన్ బయట కెల్లి మాటాడుకుందాం"

"చూడ్రా సిమ్మాచెలం మా బావ్ టేషన్‌కొత్తానని రాలేదు. నువ్వు కలిసినావు సరిపోనాది గానీ లేపోతే నాపని ఎంతిదైపోనూ, ఆ అద్దోనం అడివిలో"

"ఏటి మీ బావూ ఇక్కడే ఉన్నాడేటి? ఏటి సేస్తండేటి" అడిగాడు సింహాచలం.

"పెద్ద చదువులు చదువుతానని అయిదరాబాద్ వచ్చేనాడు. వర్తి అమాయకుడు. ఆడిగురించే నాకు బెంగ. పోస్లేగానీ ఇంతకీ మీ బావు కదేటో చెప్పినావు కాదు" ఉత్సుకత ఆపుకోలేక అడిగాడు.

"అదా సెప్తాను ఇను- మా పెద్దోడి కోసం నానెన్ని పాట్లు పడ్డాననుకున్నావ్. ఆడికి సదువు అబ్బలేదు. ఏడో తరగతి నాలుగు సుట్లుపోయింది. తాలేత ఆడికి తాపీపన్ల పెట్టినాను. అక్కడొక కూలి కొచ్చిన పిల్లకి సెయ్యిపట్టి లాగేడని ఆలంతా కలిసి తన్ని తోస్నేరు. ఆ తర్వాత కొబ్బరికాయల దుఖాణంల కలాసిగ పెట్టినాను. వందకాయలకాడ ఒక సెయ్యినొక్కేసి ఒకనాడు సావుకారికి దొరికిపోనాడు. ఆ తరువాత చిట్టాలస బుగతగేదెలు కాయడానికి పెట్నాను. గేదెల్ని మేతకు తీసుకెల్లి పాలుపితికేసి అమ్మీసోడని ఆ బుగత పనిలోనుంచి తీసేనాడు. ఇక మన జిల్లాల లాభం నేదని ఇసాకపట్నం ఆల పెద్దమ్మ గోరింటికి పంపినాను. అక్కడే ఎలాగో ఒక లాగా బీచీలో పల్లీలమ్ముకొని బతికీలేడా అని. మనోడు ఆల పెద్దమ్మకి, పెద్దయ్యకి మద్దిన పితలాటకమెట్టేనాడు. మొగుడు పెళ్లాలు మద్దిన లేనిపోని మాటలు సెప్పి తగువులెట్టేసి రెండు నెలలు తిస్టేసినాడు. ఆలకి అసలు ఇసయం తెలిసిపోయి నాలుగు తగిలించి ఎండబెట్టేసినారు. పోస్లే కన్నాను కాబట్టి కూలో నాలో చేసి పెంచుతాను ఇంటికాడ కూకోరా అంటే అలాగ కూకుండోడు కాదు. ఊర్లోని ఆస్టల్ వార్డెనర్‌కి బెదిరించి డబ్బులడగడం, దేవుడి పూజలని సందాలు దండి సారాతాగడం, సెరువుకాడ ఆడపిల్లలతో ఇకటాలాడడం చేసోడు. ఈడి బుద్దులన్నీ సూసినోలు పోలీసు సెలచ్చన్‌కు పంపీమన్నారు. అయితన్నీ సరిపోయాయి గానీ ఏడో తరగతి పోయిందని ఆలు పంపీసినారు. పనీపాటలేకుండా కూకోడంతో మనోడు సిగరెట్లు, కైనీలు ఒకటి కాదు రెండు కాదు ఎటేటో నమిలీసోడు. మనిసి అక్కడుంటే కంపుతెంపు లేకుండా పారొచ్చేది. ఈడి పనులతో ఇసిగిపోనాను. మరీడు పనికిరాడని తెలిసిపోయి ఆడెలాగ పోతేపోనని వదిలీసినాను. గత కొత్తామాస తరవాత ఎలచ్చన్లొచ్చినాయి- యాదుందానీకు! అద్గదీ అప్పుడు నుంచిర మావోడికి దరిద్రం సుట్టుకున్నట్టు దసపట్టీసింది" అంతవరకు మౌనంగా వింటున్న అప్పన్న- ఉత్సాహం ఆపుకోలేక అడిగాడు. "ఏటి మీవోడు ఎలచ్చన్ల పోటీచేసినాడా ఏట"ని

"గాబరవకేస్... సెప్పుతన్నానా" అని కొనసాగించేడు సింహాచలం. "ఎలచ్చన్ పెచారానికి అదేదో పార్టీవోలు మా ఊరొచ్చినప్పుడు మావోడు ఆలమీదికి రెచ్చిపోయి- మా ఊరికి ఏటి సేసినారని వోట్లడగానికి వచ్చినారు. ఒక బారు పెట్టినారా! ఒక బీచ్ తవ్వించినారా అని లేసాడు. ' ఈసారి మా పారిటీ గెలిస్తే కళింగపట్నం నుంచి సముద్రాన్ని ఇటుపక్క తెచ్చి బీచీ కడతామన్నారు. అయినా మావోడు ఒప్పుకోకుండా ఆలమీదకు ఎగిరాడు. ఈ ఇసయం ఎలగ తెలిసిపోయిందో ఆల ఎగసపారిటీవోలికి తెలిసిపోనాది. ఈలు ఇనాగ ఎల్లినారో నేదో ఆలు అనాగ వచ్చేసి మావోడిని బుజాల మీదకి ఎక్కించుకొని ఆలపారిటీలో కలుపుకున్నారు. ఆలపారిటీ నాయకుడి దగ్గరికి తీసుకెళ్లి మావోడికున్న సిన్నలన్నీ సెప్పినారట. ఆలపారిటీ కార్యకర్తలకి కావలసిన లచ్చనాలన్నీ మనోడి దగ్గర ఉన్నాయని ఆల పారిటీ పెచారానికి ఊరూర ఈడ్ని తిప్పినారు. ఈడి అనుబవమంతా దారబోసి ఎమ్మెల్లేని గెలిపించినాడు. ఎమ్మెల్లీ మనోడి గురించి ముఖ్యమంత్రికి సెప్పి అదేదో శాఖకి సైర్‌మేన్‌గా ఏసీనారు. ఇప్పుడు రెండు సేతులా డబ్బుకు డబ్బు పేరుకు పేరు. అదిరా అప్పన్నా మావోడి కద" ముగించాడు సింహాచలం.

"ఓరే సిమ్మాచలం నాను ఈ పొద్దే తిరుగు బండికి మా వూరెళ్లిపోతానురా" అన్న అప్పన్న వంక అయోమయంగా చూశాడు సింహాచలం.

"అదేట్రది... ఇంత దూరమొచ్చి మీ బావును కలవకుండా, అయిదరాబాద్ టవును సూడకుండా ఎలిపోతానంటావ్- నీకేటి పట్టుకుందేటి"

"లేదురా సిమ్మాచలం మా పెద్దగుంటడు నామాట ఇనకుండా పిజీయో పాజియో సదువుతానని ఇక్కడికి పారొచ్చినాడు. ఆడెలాగూ పనికిరాకుండా పోతాడు. మా సిన్న గుంటడికి మీ పెద్దోడి లచ్చనాలన్నీ ఉన్నాయి. అరిజెంటుగా ఆడినైనా పెయోజకుడ్ని సెయ్యాల" అంటూ భుజం మీదికి మూట ఎత్తుకొని తిరుగు ప్రయాణానికి స్టేషన్ వైపు నడిచాడు.

★